# 'వశీకరణమంత్రం'

"భార్యాభర్తల మధ్యన అనురాగాన్ని పెంపొందింపజేసే అద్భుతశక్తి గల ఉంగరం . భర్తను భార్య, భార్యను భర్త తమ మాట వినేలా, అనేక లోహములను సమపాళ్ళలో మిశ్రమం చేసి తయారుచేసిన ఉంగరం గ్యారంటీ... నచ్చనిచో మీ డబ్బు వాపసు యివ్వబడును యీ ఉంగరం మీచెంత వుంటే చాలు... ఎదుటివారు మీ ప్రభావానికి లొంగిపోగలరు......ఎంతటి గయ్యాళి భార్య అయినా మీ మాట వచ్చినట్లు వింటుంది .."

పేవ్ మెంటుమీద టేబిల్ నిండా ఉంగరాలు పరుచుకుని అరుస్తున్న వాడి చివరి మాటలు నాకు బాగా నచ్చాయి ..అప్పటికే వందలాది మంది ఎగబడి ఉంగరాలు కొంటున్నారు చూస్తుండగానే రద్దీ ఎక్కువైపోయింది... పిల్లలు ముసలివారు .. ఆడా... మగా. . అన్ని రకాలవారూ ఎగబడి కొంటున్నారు

చాలా చవక నేపాల్ లో మంత్రించబడిన ఉంగరాలు రెండ్రూపాయలు మాత్రమే .

నేను క్షణంసేపు ఆలోచించాను ఒక్కసారి ఈసాయంత్రమప్పుడు యింట్లో వంట ప్రయత్నాలు చేస్తున్న కమల గుర్తుకు వచ్చింది

కొంతమంది మనుష్యులు కేవలం అర్థంకాకుండా మాట్లాడడానికే పుడతారనేది నిజం। నీవు చెప్పింది నిజమైనప్పటికీ దాన్ని కాదనడమే వాళ్ళ ప్రధానలక్ష్యం ।। అయితే నువు చెప్పిందానికన్నా వాళ్ళు ఏదో గొప్పగా ఆలోచించి చెప్పే దేమీ ఉండదు అయితే నువు చెప్పిందానినే తిరిగి వాళ్ళ మాటలలో నీకే చెప్పడం వాళ్ళలోని ప్రత్యేకత సరిగా యీ కోవకు చెందినదే మా శ్రీమతి (కమల)

ఇక ఆలోచనకు స్వస్తి చెప్పి, రెండు రూపాయలు చెల్లించి ఉంగరం కొన్నాను 'ఇది మీదగ్గిర వుంటే చాలు; దాని మహిమ అలాంటిది '

---

'రుక్మిణి'

రాత్రి పదిగంటలకు యింటిదారి పట్టాను .. యింట్లోకి అడుగు పెట్టానో లేదో శ్రీమతి కంఠస్వరం వినిపించింది.

"ఇంత పొద్దు పోయిందాకా ఎచట రాజకీయాలు వెలగబెట్టారు...టైం తెలీ దంలా ..''

నా వళ్ళు భగ్గున మండింది. ఇంకో మారైతే గప్‌చిప్‌గా దొడ్లోకి నడిచే వాడ్ని... . కాని నా జేబులో ఉన్న ఉంగరం విషయం గుర్తుకు వచ్చి అట్లాగే ఓ క్షణం కమల మొహంలోకి చూశాను ... ఎందుకో ఏనాడూ లేని ధీమా దాని మొహంలో కనిపిస్తోంది.

"ఏం, నీ ముందు కబుర్లు చెబుతూ కూర్చోవాలా.. నా యిష్టం...ఎక్కడో ఓ చోట నా యిష్టమైన పనులు చేస్తాను. నీ కేమీ సంజాయిషీ యివ్వాల్సిన అవ సరం నాకు లేదు.''

''నా కివ్వకపోతే యింకెవరి కిస్తారు. అడ్డమైన చాకిరీ చేసి కండ్లలో వత్తులు వేసుకుని మీ కోసం ఎంత సేపని కాచుకు కూర్చోవాలి.''

"ని న్నెవడోయ్ కూర్చోమన్నది. ఇంటికి రాగానే వెధవ సాధింపులు;" ఏనాడూ ఎదురుతిరిగి మాట్లాడని నా నోటి వెంట మాటలు బాణాల్లా వచ్చేస్తు న్నాయి...ఉంగరం ప్రభావం అది.

"నా మొహాన యిలా వ్రాసుంది కాబట్టే యిలా ఏడుస్తున్నాను. పైగా ఏనాడూ లేనిది యిదొహటా... నేను వెధవనే...అవున్లే అలాగే ఉంటుంది."

దానిగొంతు తారాస్థాయి నందుకుంది. ఇంతకుముందు ఏనాడూ అది అంత తీవ్రంగా ఎగబడినట్లు నాకు గుర్తులేదు. ఏవో ఒకటిరెండుమాట లని ఊర్కొనేది.

"మా ఇంటికి పోతే తెలిసొస్తుంది... ఈ పాడు కొంపలో బ్రతికేదానికన్నా చావడం మేలు.''

"ఏం కూశావ్ !'' నాకు తెలీకుం డానే నా చేయి ఆవేశంగా దాని చెంపను తాకింది...తర్వాత ఏడుపు...గొడవ .. ఛీ ఛీ...పాడుసంత...దొడ్లోకి పోయి మంచం వాల్చుకుని పడుకున్నాను. అపుడు వశీకరణశక్తి గల ఉంగరం గుర్తుకువచ్చింది. దాన్ని తీసి బావిలో పడేశాను. ఎలాగో ఆకలితో ఆ రాత్రి గడిచిపోయింది.

మర్నాడు ప్రొద్దున ఏవో బట్టలకోసం కమల పెట్టె వెతుకుతోంటె అడుగున నేను నిన్న కొన్నలాంటిదే ఒక మంత్ర శక్తి గల ఉంగరం కనిపించింది.

నేను తెల్లబోయాను.